క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐడీ అధికారులు

కంబాలచెరువు: సైబర్ క్రైమ్ ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం రీజనల్ ఆఫీస్ అడిషనల్ ఎస్పీ వి.గోపాలకృష్ణ స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ సందర్భంగా సీఐడీ డీఎస్పీ పి.విజయ్‌కుమార్. సీఐడీ ఇన్‌స్పెక్టర్లు ఐ.గోపాలకృష్ణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, డి.రమేష్‌బాబు, విజయ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న విధానాలను విద్యార్థులకు వివరించారు. వాటిని ఎలా అరికట్టాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పార్ట్ టైం ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్‌లో మోసాలు ఇటీవల అధికమయ్యాయన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో సొమ్ములు పోగొట్టుకుంటే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930కి ఫోన్ చేయాలన్నారు. 1930 నంబర్‌కు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, రిజిష్టర్ చేసుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో రాజమండ్రి ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కేఎస్ రెహమాన్. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ భరత్



పూజలు చేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగర వాసులకు అత్యంత ప్రీతికరమైన కోటసత్తెమ్మ తల్లి చల్లని దీవెనలు అందరిపైనా ఉండాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. శనివారం నగరంలోని 50వ డివిజన్‌లో ఉన్న కోట సత్తెమ్మ జాతర మహోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దేవస్థానం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అజ్జరపు వాసు, కొత్తా బాల మురళీకృష్ణ, కాంతారాం పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు

కడియం: స్థానిక కెనాల్ రోడ్డు రాజవీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ దాసరి శేషగిరి తెలిపారు.

వైభవంగా మరకత లింగ ప్రతిష్ఠాపన



మహోత్సవంలో పాల్గొన్న రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

ప్రకాశం నగర్: గౌతమ ఘాట్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన మరకత ఉమామహేశ్వర లింగం ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమామహేశ్వర లింగాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి పాలసానపల్లి హనుమంతరావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సత్కారం



జ్యోతికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కడియం: మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో 975/1000 (ఎంపీసీ) మార్కులు సాధించిన పి.జ్యోతికను కాలేజీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీఎస్‌వీ వేంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థుల్లో జ్యోతిక జిల్లా టాపర్‌గా నిలిచిందన్నారు. ఆమె మరెన్నో విజయాలు సాధించాలని కాంక్షించారు. తమ కాలేజీ నుంచి సెకండియర్ బైపీసీలో కె.దుర్గా 769 మార్కులు సాధించిందన్నారు. ఎంపీసీలో కె.హేమ 864, ఎం.హరిప్రియ 823, ఎ.తబితా ఆషా 810, సీహెచ్ లహరి 756 మార్కులు సాధించారని పిన్సిపాల్ తెలిపారు. అధ్యాపకులు ఎం.విజయకుమార్, బీఎస్‌వీ రామ్‌కుమార్, రామాకృష్ణారావు తదితరులు సత్కరించారు.

మీ ఇంటి పెద్ద కొడుకునవుతా..



నగరంలోని 38వ వార్డులో పర్యటిస్తూ పథకాలను వివరిస్తున్న ఎంపీ భరత్‌రామ్

- కష్ట నష్టాల్లో తోడుంటా..
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించండి
- సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్
- నగరంలో పర్యటించి.. ప్రజల సమస్యలు తెలుసుకొని..

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ ఇంటి పెద్ద కొడుకుగా, మీ తోబుట్టువుగా మీ కష్టనష్టాలలో పాలుపంచుకుంటానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం నగరంలోని 38వ డివిజన్‌లో పార్టీ ఇన్‌చార్జి అరిగెల బాబు ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీగా నగరానికి చేసిన అభివృద్ధిని, ఎమ్మెల్యే అయితే చేయబోయే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నగర అభివృద్ధి కార్యక్రమాలను తెలిపారు. టీడీపీ నేతల ఎన్నికల ముందు హామీలిచ్చి, నెగ్గిన తర్వాత రాజకీయాలను అడ్డం పెట్టుకుని అక్రమార్జనలకు పాల్పడడం తనకు చేతకాదన్నారు. తనకు ఎటువంటి వడ్డీ, చిట్ల వ్యాపారాలు లేవన్నారు. రాజకీయాలలోకి వచ్చి ఆస్తులు అమ్ముకున్నానని, జన్మనిచ్చిన ఊరుకు సేవ చేయాలనేదే నా కోరిక అన్నారు. గతంలో టీడీపీ నేతలు ఎటువంటి అభివృద్ధీ చేయకపోగా నేను చేస్తున్న అభివృద్ధి పనులపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. చేపట్టిన ప్రతి పనీ ఆపడానికి అనేక ఆటంకాలు సృష్టించారని, అయినా ఎక్కడా ఆగకుండా పనులన్నీ దిగ్విజయంగా పూర్తి చేయడం వల్లనే నగర రూపురేఖలు మారాయన్నారు. అభివృద్ధి పనిలో 25 శాతం కమిషన్ తీసుకున్నట్టు ప్రతిపక్షాలు అదే పనిగా నాపై బురద జల్లాయని, కరపత్రాలు ముద్రించి నగరంలో పంచారని, మీడియా సమావేశాలలో ఆరోపణలు గుప్పించారన్నారు. ప్రతిపక్షాలు చెబుతున్నట్టు 25 శాతం కమిషన్ కాదు ఒక్క శాతం కమిషన్ తీసుకున్నట్టు నిరూపించినా రాజకీయాల నుంచి తప్పుకుని, ఊరు విడిచి వెళ్లిపోతానని సవాల్ చేశానని చెప్పారు. అయితే మీరు సిద్ధమా అని ప్రశ్నించినా సమాధానం లేద ని అన్నారు. నేను ప్రజల వద్దకు వచ్చి చేసిన అభివృద్ధి చెబుతున్నా నచ్చితే ఓటు వేయమని కోరుతున్నానన్నారు. సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రాగానే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మంత్రి చెల్లుబోయిన వేణు, మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎంపీ గిరజాల వెంకట స్వామినాయుడు

ప్రజల హృదయాల్లో సీఎం జగన్

- మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు
- రాయుడుపాకలు గ్రామంలో వైఎస్సార్ సీపీలో చేరిన 200 మంది

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచారని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం రాత్రి రాయుడుపాకలు గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి పిన్నమరెడ్డి వీరరాఘవ, పిన్నమరెడ్డి నారాయణ, పిన్నమరెడ్డి సీతారామరాజు 200 మందితో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామినాయుడు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ జగనన్న పాలనలో దళారి వ్యవస్థకు తావులేదని, నేరుగా సంక్షేమాన్ని ప్రతి ఇంటికి అందించారని తెలిపారు. అందుకే ప్రజల గుండెల్లో జగన్‌మోహన్ రెడ్డి నిలిచిపోయారన్నారు. ప్రజల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చిన తాను అండగా నిలుస్తానని మంత్రి వేణు అన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి మాట్లాడుతూ మీ కుటుంబాల్లో మంచి జరిగిందనుకుంటేనే ఓటు వేయమని ధైర్యంగా చెప్పిన నేత సీఎం జగన్ ఒక్కరే అన్నారని అన్నారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబం ఏదో ఒక పథకం ద్వారా లబ్ది పొందిందన్నారు. మాజీ ఎంపీ గిరిజాల వెంకటస్వామినాయుడు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలను జగనన్న మళ్లీ అధికారం చేపట్టగానే వెంటనే తీరుస్తామని హామీ ఇచ్చారు. మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు మాట్లాడుతూ జగనన్న ఒక్కరే సింహంలా సింగిల్‌గా వస్తుంటే.. ప్రతిపక్షాలు అన్నీ కలిసి గుంపులుగా వస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు పడాల ప్రసాద్, పిన్నమరెడ్డి సూర్య చంద్రరావు, వాకపల్లి సుదర్శన్,అల్లాడ గణేష్, నల్లమిల్లి సుబ్బరావు, మోటిక చిన్ని బాబు, పరిమి దుర్గరావు, లాయర్ శ్రీను, షేక్ చానా, గెద్దం శ్రీను, బాషా, జుత్తుక శ్రీ రామకృష్ణ, జుత్తుక సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొడతాం

వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మహమ్మద్ ఆరిఫ్

ప్రకాశం నగర్ : మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతన సహాయం ప్రభుత్వం నిలిపివేసిందని ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొడతామని వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ పేర్కొన్నారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మసీదులకు బకాయి ఉన్న ఇమామ్ మౌజన్‌ల గౌరవ వేతనాలు విడుదల చేసినందుకు జిల్లాకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆరిఫ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఇంతవరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాలుగు వేల పై చిలుకు మసీదులకు గత ప్రభుత్వం ఇచ్చే దాని కన్నా రెట్టింపు చేసిన రూ.15 వేల గౌరవ వేతనం నిర్విరామంగా అందుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మసీదులకు అక్టోబర్ 2023 నుంచి మార్చి 2024 వరకు ఆరు నెలల ఉన్న గౌరవ వేతనాలు రూ.45 కోట్ల ప్రభుత్వం విడుదల చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. మతతత్వ పార్టీలతో చెలిమి చేసిన తెలుగుదేశం జనసేనలు ముస్లింల సంక్షేమంపై ఎటువంటి దుష్ప్రచారం చేసినా సమర్థంగా తిప్పి కొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ నిజాం, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ రమీజ్, నగర అధికార ప్రతినిధి మహమ్మద్ షబ్బీర్, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మస్తాన్ బేగ్, సంయుక్త కార్యదర్శి షమ్మి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల త్యాగాలు వెలకట్టలేనివి

కడియం: సంక్షేమ, విజ్ఞాన, సమసమాజం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన ఉద్యమకారుల కృషికి, త్యాగానికి వెలకట్టలేనివని ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి ఎ.షరీఫ్, కోశాధికారి ఈవీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. వేమగిరిలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమం కోసం కృషి చేసిన చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకటస్వామి, ఏవీ సూర్యనారాయణ రాజు, బడుగుల్లో విద్యా వ్యాప్తి కోసం కృషి చేసిన పూలే, తొలితరం ఉపాధ్యాయిని సావిత్రీబాయి ఫూలే, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.అబ్బాయి, వేదుల శాస్త్రి మాట్లాడుతూ నాటితరం త్యాగాలు నేటి యువతకు తెలియజేయడానికి యూటీఎఫ్ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సదస్సులు నిర్వహించి ఆ నాటి ఉద్యమ ఫలాల అందరికీ అందిస్తోందన్నారు. హక్కులు బాధ్యతలు యూటీఎఫ్‌కి రెండు కళ్ళు అన్నారు. రాష్ట్ర యుటీఎఫ్ కౌన్సిలర్ ఎస్ అనిత ఐక్య ఉపాధ్యాయ రాష్ట్ర పత్రిక ఉపసంపాదకులు చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు నమోదుకి కృషి చేయాలి అన్నారు. అనంతరం ఉద్యమ గీతాలను ఆలపించారు.

ఈవీఎంలకు కట్టుదిట్టమైన భద్రత




స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎంలను, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను కట్టుదిట్టమైన ఏర్పాట్లతో భద్రపరిచినట్లు రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనరు కె.దినేష్ కుమార్ శనివారం తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత సిటీ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 310 ఈవీఎంలు, 285 కంట్రోల్ యూనిట్లు, 285 వీవీపాట్‌లను ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మొదటి అంతస్తులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేశామన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గంలోని అర్బన్‌కు సంబంధించిన ఎన్నికల సామగ్రిని స్ట్రాంగు రూంలో ఉంచి సీలు వేసి గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అర్బన్ కె.ఆంజనేయులు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణు

ధవళేశ్వరం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం ధవళేశ్వరంలో డ్రీమ్స్ స్కూల్ 14వ వార్షికోత్సవం కార్యక్రమానికి మంత్రి వేణు ముఖ్య అతిథిగా విచ్చేసి, ఈ విద్యా సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయి విద్యను సాధారణ ఫీజులకు అందిస్తున్న డ్రీమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం జరిగిన సాంస్కృతి ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కబడ్డీ, క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎ.రమేష్, స్కూల్ ప్రిన్సిపాళ్లు వి సంధ్యారాణి, జి.విమలారోజి, ఎన్.దీపిక, వేమగిరి పాఠశాల ఫస్ట్ స్టెప్ ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.లలితాదేవి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వలస నాయకులను తరిమికొట్టండి

- టీడీపీ ప్రజాప్రతినిధులు నగరానికి చేసిందేమీ లేదు
- నేను చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి గెలిపించండి
- మీడియాతో ఎంపీ భరత్‌రామ్



ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ : ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులుగా వలస వచ్చే నాయకులను తరిమికొట్టాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ స్థానిక నాయకులను కాదని వలస నాయకులను దిగుమతి చేసుకోవడం టీడీపీ, బీజేపీకి అలవాటేనని అన్నారు. అంటే స్థానిక నేతలపై నమ్మకం లేకనే బయట నుంచి నేతలను లోక్‌సభ స్థానానికి బరిలోకి దింపుతున్నాయని ఎద్దేవా చేశారు. 2014లో సినీ నటుడు మురళీమోహన్ టీడీపీ ఎంపీగా గెలిచిన తరువాత నగరాభివృద్ధిని, ఓట్లేసిన ప్రజల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. 2019 ఎన్నికలలో సిటీ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిరెడ్డి భవాని నగరాన్ని, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. సిటీ ఎమ్మెల్యేగా ఆమె ప్రజల వద్దకు వచ్చి సమస్యలు పట్టించుకున్నదే లేదన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే భవాని భర్త ప్రజల వద్దకు వచ్చి అది చేస్తా,ఇది చేస్తా అని ఓట్ల కోసం వంచించడానికి యత్నిస్తున్నాడని ధ్వజమెత్తారు. 2014–24 అంటే పది సంవత్సరాల పాటు టీడీపీ ఎంపీ, టీడీపీ ఎమ్మెల్యే వల్ల నగరాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. అలాగే ఆదిరెడ్డి కుటుంబానికి చెందిన వారే మేయర్‌గా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా మొత్తం 16 సంవత్సరాల పాటు రాజకీయ పదవులు పొంది రాజమండ్రి నగరాన్ని భ్రష్టు పట్టించారన్నారు. నేను ఎంపీగా చేసిన నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కష్టపడ్డానన్నారు. నా ఊరును అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్నదే నా తపన, ఆరాటం, సంకల్పం అన్నారు. గతంలో ఏ ఎంపీ చేయని రీతిలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు శాంక్షన్ చేయించి ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. ఇవన్నీ కేవలం రెండున్నర సంవత్సరాల కాలంలో చేసినవే అన్నారు. కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో కూడా ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వస్తుందోనని రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తూ, వేలాది మందికి నిత్యావసర వస్తువులు అందించే కార్యక్రమం సమర్థవంతంగా చేపట్టామన్నారు. కాశీ తరహాలో గోదావరి ఘాట్లను అనుసంధానం చేసి, నాలుగు కిలోమీటర్ల పొడవునా వాకింగ్ చేసేలా చేస్తానని, అలాగే హైదరాబాద్ టాంక్ బండ్ కు మించి గోదావరి బండ్‌ను అభివృద్ధి చేస్తానన్నారు. సాంస్కృతిక, సాహిత్య, పర్యాటక రంగాలలో నగరానికి గత వైభవాన్ని తీసుకు వస్తానని చెప్పారు. నగర వాసులకు 24 గంటలూ మంచినీటి సరఫరా అయ్యేలా చర్యలు చేపడతానని తెలిపారు. చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యమని ప్రజలను కోరుతున్నట్టు ఎంపీ భరత్‌రామ్ తెలిపారు.

రేపు ప్రజాస్వామ్య పరిరక్షణ సభ

ప్రకాశం నగర్: లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభను వై.జంక్షన్ వద్ద ఉన్న ఆనం రోటరీ హాల్‌లో సోమవారం నిర్వహించనున్నట్టు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ స్టేడియం వద్ద గల సీపీఐ కార్యాలయంలో ఇరు పార్టీల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తాటిపాక మధు, టి.అరుణ్ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరు అవుతున్నారని చెప్పారు. గౌరవ అతిథి గా కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు హాజరుకానున్నారని తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీనియర్ నాయకులు ఎస్ఎస్ మూర్తి, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు పాల్గొన్నారు.

సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠ మహోత్సవం

ప్రకాశంనగర్: సీతారామచంద్ర మందిర ప్రతిష్ఠ మహోత్సవం శనివారం స్థానిక 3వ వార్డు సుబ్బారావు పేటలో ఘనంగా జరిగింది. మొదటి రోజు ప్రత్యేక పూజలు, అఖండ దీప స్థాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, రాజమహేద్రవరం వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా నగేష్, బళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వైద్యులను అన్ని విధాలా ఆదుకుంటాం

ఆత్మీయ సమావేశంలో మంత్రి వేణు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: మనందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద డాక్టర్ అని, అందరికీ సంపూర్ణ ఆరోగ్యం కావాలనే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారని మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ధవళేశ్వరం జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో శనివారం ప్రాథమిక వైద్యుల ఆత్మీయ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి వేణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వైద్యులను గ్రామీణులు దేవుళ్లగా కొలుస్తారన్నారు. ఆరోగ్య పరంగా ఏ చిన్న సమస్య వచ్చినా ముందుగా వారినే సంప్రదించి, సూచనలు, సలహాలు తీసుకుంటారని, ఆతర్వాతే ఆసుపత్రులకు వెళతారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రాథమిక వైద్యుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత వారి సమస్యలు దూరం చేసి అన్ని విధాలా ఆదుకుంటారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని మంత్రి వేణు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లంక సత్యనారాయణ, కొమ్మ సత్యనారాయణ, ఎస్‌కే ఇమామ్, బాబ్జీ, ఎంవీవీ సత్యనారాయణ, పక్కుర్తి సత్యనారాయణ, కన్నాబత్తుల శ్రీను, ఆకాశం గోరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేణు పరామర్శ

ఇటీవల గాయపడిన వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు పట్టపగలు వెంకటలక్ష్మిని శనివారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ధవళేశ్వరంలోని వెంకటలక్ష్మి స్వగృహానికి వెళ్లి ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్(త్రైతశకం–46)ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసరఫరాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు మంత్రి వేణు గోపాలకృష్ణకు భగవద్గీతను బహూకరించారు. రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు శేఖర్ బాబు, లక్ష్మీనారాయణ, జయరాం, గోవిందు, కె.లోకేష్, జగన్, మోహన్, సంధ్యారాణి, శోభారాణి, సూర్యకుమారి, కె.లక్ష్మీ నారాయణ, కె.నరసింహ మూర్తి, బి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంతి రేఖకు నంది పురస్కారం



గజ్జల వెంకటలక్ష్మిరెడ్డి చేతుల మీదుగా నంది పురస్కారం అందుకుంటున్న కాంతిరేఖ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీ నగర్‌కు చెందిన లుక్అప్ ట్రెండ్జ్ డైరెక్టర్ కె.కాంతిరేఖకు నంది పురస్కారం లభించింది. శనివారం ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ధర్మం చర కమ్యూనిటీ హాల్ నిర్వహించిన ఉగాది నంది పురస్కారాల వేడుకలో ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మిరెడ్డి చేతుల మీదుగా ఆమె నంది పురస్కారాన్ని అందుకున్నారు. లుక్అప్ ట్రెండ్జ్ సంస్థను నెలకొల్పి మహిళా సాధికారిత కోసం ఎన్నో కార్యక్రమాలను, స్వయం ఉపాధి, మనో వికాసం కోసం 3 వేలకు పైగా మహిళలకు శిక్షణ ఇచ్చినందుకు ఈ పురస్కారం లభించిందని కాంతిరేఖ తెలిపారు. ఆమెజాన్‌లో బెస్ట్ సెల్లర్‌గా తాను రాసిన మోడరన్ ఉమెన్ గైడ్ బుక్ నిలిచిందని కాంతిరేఖ తెలిపారు.

బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా పని చేయాలి

ప్రకాశం నగర్: విభజన హామీలు అమలు చేయని బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా వామపక్ష పార్టీలు లౌకిక శక్తులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జట్ల సంఘం కార్యాలయంలో జట్ల లేబర్ యూనియన్ మేస్త్రీల సమావేశం యూనియన్ అధ్యక్షుడు కుంద్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం, నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వకుండా విభజన్ హామీలు అమలు చేయకుండా 5 కోట్ల ప్రజలను బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి ప్రచారినికి వస్తే తూర్పు ప్రజలు చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలపాలని కోరారు. బీజేపీ పొత్తు పార్టీలను ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల: గీతాంజలి మళ్లీ వచ్చింది
సూర్యమినీ: మైదాన్
సూర్యప్యాలెస్: మంజుమ్మల్‌బాయ్స్
స్వామి: దిఫ్యామిలీస్టార్
శివజ్యోతి: లవ్‌గురు
అనుశ్రీ: మంజుమ్మల్‌బాయ్స్
రాజా: బడేమియా చోటేమియా
ఊర్వశి: శ్రీరంగనీతులు
రంభ: బడేమియా చోటేమియా
మేనక: ప్రాజెక్టు 2
అప్సర: టిల్లుస్క్వేర్
కుమారి: టిల్లుస్క్వేర్

నామవరం

వీఎస్.మహల్: దిఫ్యామిలీస్టార్,లవ్‌గురు

ధవళేశ్వరం

మురళీకృష్ణ: దిఫ్యామిలీస్టార్,టిల్లుస్క్వేర్

కడియం

వెంకటసూర్య: గీతాంజలి మళ్లీ వచ్చింది